# అవతలి వాడు

మిణుకు మిణుకు మంటూ
అనంతకోటి నక్షత్రాలు
చీకటి లోనే మగ్గుతున్నట్టు
వేలకు వేల నీడలు
గోడల మీద పాకుతున్నట్టు
వాడి నాలుగు గోడల అనుభవం.

వాటి మధ్య
పేలుళ్లు వినిపించవు
కాళ్లకంటుతున్నా రక్తం కనిపించదు
దుర్గంధమేదీ బయటకు పోదు
అంతా మామూలుగానే సాగిపోతున్న వైనం
గోడల కావల ప్రకంపనల కోసం
అలవాటుగ
తలను తీసి గోడలకు వేలాడదీస్తాడు
మచ్చిక చేసుకున్న మేక పిల్లలను
మందలు మందలుగా తరుముతాడు
అలవాటుగా -
నిశ్శబ్దం కూడా భయంకర శబ్దంలా వినబడుతుంది
రక్తం వరదలా కొట్టుకొస్తున్నట్టు
ఆకలి మంటలు శవాల వాసనలు మోసుకొస్తున్నట్టు
ఎప్పుడూ అనిపిస్తూనే ఉంటుంది

ఏమి చేయాలో తోచదు
తలను గబగబా తగిలించేసుకుని
తలో దిక్కుకీ పరిగెడతాడు

ప్రతిధ్వనించాల్సిన మాటలని
ప్రతి స్పందించాల్సిన క్షణాలని
అందర్నీ అప్రమత్తం చేస్తాడు
అరుస్తాడు
గీపెడతాడు

అందరూ అలవాటు పడ్డవే!
అయినా గోడలు గోడలే కదా!
కూలి పోయే ముందు సంకేతాలైనా ఇవ్వవు

అప్పుడు చూడాలి
అందరి కళ్లభూతద్దాల్లోనూ
అంతవరకూ అందమైన దుస్తుల్లో దాక్కున్న
వాడి వొంటి మీద మచ్చలు
పసిపిల్లల పిచ్చిగీతల్లా –